సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 30 । నవంబర్ । 2023



విద్యార్థినులకు ముగ్గుల పోటీలు

ప్రపంచ హెచ్ఐవీ/ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకుని వైద్య ఆరోగ్యశాఖ అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. 8లో



విశేషంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు.



శ్రీవారికి వెండి శఠగోపం

రంపచోడవరం: వేంకటేశ్వరస్వామికి సీతానగరానికి చెందిన భక్తులు బంగారు పూతతో వెండి శఠగోపాన్ని అందజేశారు.

న్యూస్‌రీల్

విద్యార్థుల సామర్థ్యం పెంపుపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏజెన్సీ డీఈవో మల్లేశ్వర్రావు

అడ్డతీగల: టెన్త్ విద్యార్థుల సామర్థ్యం పెంపునకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు సూచించారు. బుధవారం ఆయన స్థానిక గురుకుల ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. జగనన్న విద్యాకానుకలో పొందిన లబ్ధి వివరాలను ఆయన తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ హరినాథ్ పాల్గొన్నారు.

పశువైద్యశాల తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న ప్రత్యేకాధికారి చంద్రమౌళి నాయక్

గంగవరం : నెల్లిపూడి గ్రామీణ పశు వైద్యశాలను ఆశాఖ జిల్లా ప్రత్యేకాధికారి డా.చంద్రమౌళి నాయక్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పశు వైద్యశాలలో చేపట్టే కార్యక్రమాలపై సమీక్షించారు. వైద్యశాల రికార్డులను, పశు ఆరోగ్య సంరక్షణ కార్డులును ఆయన పరిశీలించారు. పశు వైద్యశాల పరిధిలో నిర్వహించిన పశువ్యాధి టీకాలు, పశు వైద్యశిబిరాల వివరాలను తెలుసుకున్నారు. గ్రామ సచివాలయ పశు సహాయకులు పనితీరుపై ఆరా తీశారు. రంపచోడవరం పశు సంవర్థకశాఖ ఉప సంచాలకుడు డా. అహ్మద్‌షరీఫ్, నెల్లిపూడి వెటర్నరీ అధికారి అప్పన్నబాబు పాల్గొన్నారు.

13న జీసీసీ పాలకవర్గ సభ్యుల స్థానాలకు ఎన్నిక

కొయ్యూరు: స్థానిక గిరిజన సహకార సంస్థ బ్రాంచి పాలక వర్గ సభ్యుల నియామకానికి వచ్చే నెల 13న ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలు మండలంలోని 23 గ్రామ సచివాలయాల వద్ద అందుబాటులో ఉంచామని రంపచోడవరం జీసీసీ సీనియర్ ఇన్‌స్పెక్టర్, ఎన్నికల అధికారి టి.వీరబాబురెడ్డి బుధవారం తెలిపారు. బ్రాంచి పరిధిలో 298 మంది సభ్యులు ఉండగా వచ్చేనెల నాలుగో తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఐదో తేదీన పరిశీలన, ఆరున ఉపసంహరణ ఉంటుంది. 13 తేదీనఉదయం 9 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎన్నిక నిర్వహించి అదేరోజు ఫలితం ప్రకటిస్తామని వీరబాబురెడ్డి పేర్కొన్నారు. పాలకవర్గానికి చైర్మన్‌గా డివిజనల్ మేనేజర్, కార్యదర్శిగా బ్రాంచి మేనేజర్ వ్యవహరిస్తారని ఆయన తెలిపారు.

11, 12న కళా ఉత్సవ్ పోటీలు

భీమునిపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించిన జిల్లా స్థాయి కళా ఉత్సవ్–23 పోటీలు డిసెంబర్ 11, 12 తేదీల్లో భీమిలిలోని జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో జరుగుతాయని ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ తెలిపారు. 9వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులు అర్హులని, ఇందులో పది కళారూపాలకు సంబంధించి పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఒక్కో కళారూపానికి ఒక్కో పాఠశాల నుంచి ఒక బాలుడు, ఒక బాలిక మాత్రమే పాల్గొనాలని, గత పోటీల్లో మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలిచినవారు అనర్హులని తెలిపారు. వివరాలకు 9573573065 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పిచ్చికుక్క దాడి.. ఇద్దరు చిన్నారులకు గాయాలు



కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్య సిబ్బంది

అనంతగిరి : మండల కేంద్రంలోని బొడ్డచెట్టు కాలనీలో బుధవారం పిచ్చికుక్క దాడిలో ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. వీరిని వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించి వైద్యసేవలు అందించారు. వీధి కుక్కలపై కూడా పిచ్చికుక్క దాడి చేయడాన్ని వెంటనే జెడ్పీటీసీ గంగరాజు పశువైద్యాధికారి సందీప్‌కు సమాచారం అందించారు. వెంటనే ఆయన పశువైద్యశిబిరం ఏర్పాటుచేసి వీధి కుక్కలకు ర్యాబిస్ వ్యాక్సిన్ వేశారు.

మన్యం మీనం మిలమిల

గిరిజనుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది. చెరువులు, సాగునీటి ప్రాజెక్టుల్లో పెంచేందుకు చేప పిల్లలను ఉచితంగా అందజేసి స్వయం సమృద్ధి సాధనకు బాటలు వేస్తోంది.

- మత్స్య పరిశ్రమను ప్రోత్సహిస్తున్న ఐటీడీఏ
- ఉచితంగా చేప పిల్లల పంపిణీ
- పెంపకంపై ఆసక్తి చూపుతున్న రైతులు



చేప పిల్లలను విడుదల చేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి,అధికారులు (ఫైల్)



చేపను చూపిస్తున్న రైతు

రంపచోడవరం: ఏజెన్సీలో చేపల పెంపకంపై గిరిజనులు ఆసక్తి చూపుతున్నారు. అక్కడక్కడ చేపల చెరువులు ఉన్నప్పటికీ స్థానికంగా ఉన్న సాగునీటి చెరువులు, జలాశయాల్లో పెంపకం చేపట్టి ఉపాధి పొందుతున్నారు. ఏజెన్సీలో పెంచే చేపలు సహజసిద్ధ వాతావరణంలో పెరుగుతున్నందున మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ఈ రంగాన్ని ప్రోత్సహించేందుకు అవసరమైన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తోంది.

చేపల పెంపకం రైతులకు..

రంపచోడవరం, చింతూరు డివిజన్‌లోని 13 మండలాల్లో సుమారు 450 మంది వరకు చేపల పెంపకం రైతులు ఉన్నారు. వీరికి 10 లక్షల చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేసింది. వీటి విలువ సుమారు రూ.3 లక్షల వరకు ఉంటుంది. వీరితోపాటు పాడేరు డివిజన్ పరిధిలోని రెండు మండలాలకు కూడా చేప పిల్లలను సరఫరా చేశారు.

మత్స్యకార సొసైటీలకు..

డివిజన్ పరిధిలో సుమారు 13 మత్స్యకార సొసైటీలు ఉన్నాయి. వీటి పరిధిలో ఐదు జలాశయాలు, మిగిలినవి మేజర్ సాగు నీటి చెరువులు ఉన్నాయి. వీరికి మూడు లక్షల చేప పిల్లలను అందజేసింది. మార్కెట్లో డిమాండ్ ఉన్న కట్ల, మోసు, గడ్డి బొచ్చు, రూప్‌చంద్ రకాల చేపల పెంపకాన్ని పోత్సహిస్తోంది.

రెండు చోట్ల ఉత్పత్తి కేంద్రాలు

డివిజన్ పరిధిలో రంపచోడవరం, రాజవొమ్మంగిలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి. వీటిలో రంపచోడవరం కేంద్రం పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తోంది. ఈ రెండు కేంద్రాల్లో ఈ ఏడా 9 లక్షల చేప పిల్లలను ఉత్పత్తి చేశాయి. పందిరిమామిడిలోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ద్వారా 7.50 లక్షలు, రాజవొమ్మంగి కేంద్రం ద్వారా 1.50 లక్షల చేప పిల్లలను రైతులు, మత్స్యకార సంఘాలకు సరఫరా చేయగలిగాయి. మిగతా 4 లక్షల చేప పిల్లలను ప్రభుత్వం కొనుగోలు చేసి సరఫరా చేసింది.

స్థానికంగానే మార్కెటింగ్

సాగునీటి చెరువుల్లో పెంచిన చేపలను స్థానికంగా విక్రయిస్తున్నారు. జలాశయాల్లో మత్స్యసంపదను పట్టణాల్లోని మార్కెట్లకు తరలిస్తున్నారు.

ఎకరా చెరువులో పెంపకం

మత్స్యశాఖ అందజేసిన చేప పిల్లలను ఎకరా చెరువులో పెంపకం చేపట్టాను. పెరుగుదల ఆశాజనకంగానే ఉంది. మరో మూడు నెలల్లో ఒకొక్కటి కేజీ బరువు వరకు పెరిగే అవకాశం ఉంది. ఎకరాకు రెండు వేల పిల్లలను వేయగా, రూ.15 వేల వరకు పెట్టుబడి అవుతుంది. రూ.70 వేల వరకు ఆదాయం రావచ్చు.

– గంప నాగరాజు,
కింద్ర, రాజవొమ్మంగి మండలం

చేపల పెంపకం లాభదాయకం



ఏజెన్సీలో చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాం మత్స్యశాఖ, ఐటీడీఏల ద్వారా ఉచితంగా చేప పిల్లలు అందజేయడం జరుగుతుంది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తున్నాం. చేప పెంపకం ఎక్కువ స్థాయిలో చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నాం.

– సీహెచ్ రమేష్, ఎఫ్‌డీవో, రంపచోడవరం

వణికిస్తున్న చలిగాలులు

- తగ్గుతున్న ఉష్ణోగ్రతలు
- చింతపల్లిలో 13.4..
- మినుములూరు 14..
- అరకులోయలో 14.5 డిగ్రీల నమోదు



వంతాడపల్లి ప్రాంతంలో దట్టంగా కురుస్తున్న మంచు



రగ్గులు కప్పుకున్న వృద్ధులు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో చలిగాలులు వణికిస్తున్నాయి. పొగమంచు కూడా దట్టంగా కురుస్తోంది. బుధవారం ఉదయం 9గంటల వరకు ఏజెన్సీ వ్యాప్తంగా మంచు తీవ్రత నెలకొంది. ఉష్ణోగ్రతలు గత నాలుగు రోజుల నుంచి తగ్గుముఖం పడుతున్నాయి. పొగమంచుతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్ని దుస్తుల వినియోగం పెరిగింది. ప్రజలు చీకటి పడితే చలిమంటలను వేసుకుని ఉపశమనం పొందుతున్నారు. ఏజెన్సీని సందర్శనకు వచ్చిన పర్యాటకులు చలిగాలులకు వణికిపోతున్నారు. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం వద్ద బుధవారం 13.4 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 14డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 14.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని సంబంధిత అధికారవర్గాలు తెలిపాయి.

సాయుధ దళ కుటుంబాల సంక్షేమానికి సహకారం

కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపు



స్టిక్కర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఇతర అధికారులు

సాక్షి,పాడేరు: దేశ రక్షణకు నిరంతరం సేవలు అందిస్తూ విధి నిర్వహణ, యుద్ధ సమయంలో అమరులు, పదవీ విరమణ చేసిన సాయుధ దళాల కుటుంబాల సంక్షేమానికి అన్ని వర్గాల ప్రజలు తమ వంతు సహాయ ,సహకారం అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపు నిచ్చారు. బుధవారం తన కార్యాలయంలో రూ.20 వేల విలువైన సాయుధ దళాల పతాక స్టిక్కర్లు, కారు ఫ్లాగ్స్‌ను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏటా డిసెంబర్ 7వ తేదీన దేశ వ్యాప్తంగా సాయుధ దళాల పతాక దినోత్సవం జరుపుకుంటామన్నారు.జిల్లా ప్రజలందరికి పతాక దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకుంటున్నామన్నారు. జిల్లాలోని వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు విరివిగా విరాళాలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సైనిక సంక్షేమానికి విద్యార్థులు,కార్మికులు కూడా విరాళాలు సేకరించే విధంగా విద్య, పరిశ్రమలశాఖల అధికారులు ప్రోత్సహించాలని ఆయన ఆదేశించారు. స్టిక్కర్ రూ.2, కారు ఫ్లాగ్‌ను రూ.5 చొప్పున విక్రయించాలని, విరాళాల నగదును సంచాలకులు,సైనిక సంక్షేమశాఖ, విజయవాడ,స్టేట్ బ్యాంకు అకౌంట్ 33881128795 నంబర్‌కు జమ చేయాలని కోరారు. ఈ సమాచారాన్ని విశాఖపట్నంలోని జిల్లా సైనిక సంక్షేమాధికారికి తెలియజేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా సైనిక సంక్షేమాధికారి జి.సత్యానందం, పర్యవేక్షకులు జి.కృష్ణారావు, సిబ్బంది వై.శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

సీహెచ్‌వోలు వెంటనే విధుల్లో చేరాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా

సాక్షి,పాడేరు: సహేతుకం కాని డిమాండ్లతో ఆందోళన చేస్తున్న సామాజిక ఆరోగ్య అధికారులు(సీహెచ్‌వో/ఎంఎల్‌పీహెచ్‌పీఎస్)వెంటనే విధుల్లో చేరాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా బుధవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. తక్షణం సమ్మె విరమించాలని వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నుంచి ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. ప్రజారోగ్య సేవల నిమిత్తం జిల్లాలోని గ్రామసచివాలయాల్లో 297మంది సీహెచ్‌వోలను ఏడాది కాంట్రాక్ట్‌పై నియమించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ప్రభుత్వంతో కుదుర్చుకున్న వార్షిక ఒప్పంద షరతులు మేరకు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, అకారణంగా విధులు నిర్వహించలేకపోయినా జిల్లా ఆరోగ్య సమాఖ్య వారి వేతనాలను నిలిపివేసే అధికారం ఉందన్నారు. విధుల నుంచి తొలిగించే అధికారం ఉందన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో సీహెచ్‌వోలు పని చేస్తున్నందున ఉద్యోగాల రెగ్యులర్ ప్రశ్న తలెత్తదని కమిషనర్ స్పష్టం చేశారని ఆయన పేర్కొన్నారు. 15రోజుల సాధారణ సెలవులను కూడా మంజూరు చేశారని, ఈమేరకు జిల్లాలోని సీహెచ్‌వోలంతా ఆందోళన విరమించి విధుల్లో చేరాలని లేకుంటే ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

హుషారుగా వరి నూర్పులు



కామయ్యపేట ప్రాంతంలో ట్రాక్టర్‌తో వరిపనలను తొక్కిస్తున్న గిరిజనులు



తీగలవలసలో వరిపంట నూర్పులు చేస్తున్న గిరిజనులు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా రైతులు వరిపంట కోతలు, నూర్పిడి పనుల్లో నిమగ్నమయ్యారు. వాతావరణం అనుకూలంగా ఉన్నందున పంట కోత చేపట్టారు. నూర్పిడి చేసేందుకు గాలులు, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున హుషారుగా చేపట్టారు. నూర్పిడి చేసిన వెంటనే ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

గిరి రైతులు అప్రమత్తంగా ఉండాలి: అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో గిరి రైతులు అప్రమత్తంగా ఉండాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వచ్చేనెల 5,6,7 తేదీల్లో అల్పపీడన ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున రైతులు పంట ఉత్పత్తులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు.

నిబంధనలకు లోబడి వైద్యం

- రంపచోడవరం ఐటీడీఏ పీవో కావూరి చైతన్య
- ఆర్‌ఎంపీలకు సూచన



సమావేశంలో మాట్లాడుతున్న పీవో చైతన్య

చింతూరు: ఆర్‌ఎంపీలు ప్రభుత్వ నిబంధనల మేరకు మాత్రమే వైద్యం చేయాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఆదేశించారు. చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాలకు చెందిన ఆర్‌ఎంపీలకు బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని ప్రజలకు వైద్యం అందించడంలో ఆర్‌ఎంపీల పాత్ర ఎంతోవుందని, వారు తమ పరిధిని దాటి వైద్యం చేస్తే ప్రాణనష్టం జరిగే అవకాశముందని తెలిపారు. అత్యవసర సమయాల్లో కేవలం ప్రాథమిక వైద్యం మాత్రమే అందించి రోగులను సమీప ప్రభుత్వ ఆస్పత్రులకు రిఫర్ చేయాలని ఆయన సూచించారు. నిబంధనలు అతిక్రమించి వైద్యం చేసేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని పీవో హెచ్చరించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య మాట్లాడుతూ ఆర్‌ఎంపీలు సెలైన్లు ఎక్కించడం, స్టెరాయిడ్లు చేయడం, పెయిన్‌కిల్లర్ మాత్రలు వినియోగించడం నేరమని తెలిపారు. చిన్నపిల్లలకు వైద్యం చేయకూడదని, ప్రసవాలు, అబార్షన్లు చేయడం వంటి చర్యలకు పాల్పడవద్దని ఆయన సూచించారు. కాగా కొందరు ఆర్‌ఎంపీలు నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాలుగు మండలాల్లో నెలన్నరగా ఆర్‌ఎంపీ కేంద్రాలను అధికారులు మూసివేశారు. బుధవారం నుంచి వాటిని యధావిధిగా తెరుచుకునేందుకు పీవో అవకాశమివ్వడంతో ఆర్‌ఎంపీలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు కారం సుబ్బారావు, శ్రీధర్, అనసూయ, పృథ్వీ పాల్గొన్నారు.

యువత ఎంచుకునే మార్గంతోనే అభివృద్ధి



వలజంగి జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా, ఏఎస్పీ ధీరజ్



వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా, ఏఎస్పీ ధీరజ్

- ఎస్పీ తుహిన్ సిన్హా
- బూసిపుట్టులో వాలీబాల్ పోటీలు, వైద్య శిబిరం
- పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహణ


ముంచంగిపుట్టు: యువత ఎంచుకునమార్గంపైనే గిరి గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. మండలంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన రంగబయలు పంచాయితీ చంపాపుట్టులో బుధవారం జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలోయువహో పేరిటా మెగా వాలీబాల్ పోటీలు నిర్వహించారు. వీటిలో 15 జట్లు పాల్గొన్నాయి. వీటిని తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భారీగా తరలిరావడంతో సందడి నెలకొంది. క్రీడాకారులను ఎస్పీ తుహిన్ సిన్హా పరిచయం చేసుకున్నారు. పోటీలను తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ గిరిజన యువతలో అపారమైన ప్రతిభ ఉందన్నారు. వాటిని వెలికితీసేందుకు పోలీసు శాఖ ఎప్పుడు ముందుంటుందన్నారు. గిరి యువత ప్రతిభ మండల స్థాయిలోనే ఉండిపోకూడదని జిల్లా, రాష్ట్ర స్థాయి, అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా ప్రతిభా నైపుణ్యాన్ని సానబెట్టాలని అన్నారు. త్వరలో సెల్ సిగ్నల్ సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందన్నారు. మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తూ పనులు జరిగే ప్రదేశాలల్లో వాహనాలు తగలబెడుతూ అమాయక గిరిజనులను హతమారుస్తూ గిరిజన అభివృద్ధిని మావోయిస్టులు అడ్డుకుంటున్నారన్నారు.అటువంటి వారికి దూరంగా ఉంటూ గిరిజనుల మేలుకోరే పోలీసు శాఖకు సహకరించాలని ఆయన కోరారు. విజేతగా నిలిచిన వలజంగి జట్టుకు రూ.15 వేలు నగదు, బహుమతిని ఎస్పీ అందజేశారు.

600 మందికి ఉచిత వైద్యసేవలు

పోలీసుశాఖ ఆధ్వర్యంలో బుధవారం చంపాపుట్టులో నిర్వహించిన సంజీవని మెగా మెడికల్ క్యాంప్‌కు విశేష స్పందన లభించింది.విశాఖపట్నం నుంచి మెడికవర్, విశాఖ ఐ హాస్పటల్ నుంచి వచ్చిన ప్రత్యేక వైద్యనిపుణులు, లబ్బూరు వైద్యాధికారులు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న 600 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యసేవలను ఎస్పీ పర్యవేక్షించారు. రోగులను ఎంతో ఆప్యాయతంగా పలకరించి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. మారుమూల గ్రామాల నుంచి వచ్చిన సుమారు రెండు వేల మంది గిరిజనులకు భోజన సదుపాయం కల్పించారు. వారితో కలిసి ఎస్పీ తుహిన్ సిన్హా, ఏఎస్పీ ధీరజ్ కలిసి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో జి.మాడుగుల సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు రవీంద్ర ,మనోజ్‌కుమార్, శ్రీనివాస్, వైస్‌ఎంపీపీ భాగ్యవతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపాధ్యాయులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ అమలుకు పక్కాగా చర్యలు

- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే



సమావేశంలో పాల్గొన్న పీవో సూరజ్‌గనోరే, డీఎఫ్‌వో నరేంథిరన్

రంపచోడవరం: పంచాయతీల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమం పక్కాగా అమలు చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే ఆదేశించారు. బుధవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో భారత ప్రభుత్వ ఎస్‌ఏపీ అడ్వైజర్ సి. శ్రీనివాసన్ సాలిడ్, లిక్విడ్ రిసోర్స్ మేనేజమెంట్ ప్రోగ్రాం ద్వారా చెత్త సేకరణ విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయన వివరించారు. అనంతరం పీవో మాట్లాడుతూ ముందుగా పర్యాటక ప్రాంతాలు, మండల కేంద్రాల్లోని వారపు సంతలు జరిగే ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పారిశుధ్య సిబ్బందికి యూనిఫామ్, టోపీ, షూస్, ఇతర వస్తువులు కొనుగోలు ప్రతిపాదనలు అందజేయాలని ఆదేశించారు. రంపచోడవరం డీఎఫ్‌వో నరేంథిరన్ మాట్లాడుతూ ఏజెన్సీకి వచ్చే పర్యాటకులు పర్యాటక ప్రాంతాల్లో వేసే ప్లాస్టిక్‌ను తొలగించేందుకు వారానికి రెండు రోజులు సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు. డీఎల్పీవో జీఎస్‌ఎస్‌వీ రాఘవన్ పాల్గొన్నారు.

వారపు సంతలో తనిఖీలు



తూనిక యంత్రాలను పరిశీలిస్తున్న అధికారి

దుంబ్రిగుడ: మండలంలోని కించుమండ వారపు సంతలో తూనిక యంత్రాలను తూనికలు కొలతలు శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ ఎస్.ఎం రాధాకృష్ణ తనిఖీ చేశారు. సీళ్లు లేని తూనిక యంత్రాలను వినియోగించడంతో ఇద్దరిపై కేసులు నమోదు చేశారు.

గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలి



మాట్లాడుతున్న టీటీడీ ఆస్థాన గాయని కొండవీటి జ్యోతిర్మయి



గిరిజనులతో కొండవీటి జ్యోతిర్మయి

చింతపల్లి రూరల్: గిరిజన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన గాయని కొండవీటి జ్యోతిర్మయి అన్నారు. మండలంలో బుధవారం ఆమె జున్నుల, గొచ్చపల్లి, బెన్నవరం గ్రామాల్లో పర్యటించారు. ప్రతిఒక్రిలో ఆధ్యాత్మిక శ్రద్ధ కలిగి ఉండాలని, మొక్కల పెంపకం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలని ఆమె కోరారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

గూడెంకొత్తవీధి: నిత్యం పనిఒత్తిడిలో ఉన్న వారికి ఆధ్యాత్మిక చింతన మానసిక ప్రశాంతతను ఇస్తుందని టీటీడీ ఆస్థాన గాయని కొండవీటి జ్యోతిర్మయి అన్నారు. గిరిజనుల విన్నపం మేరకు ఆమె బుధవారం మండలంలోని రామగెడ్డ, కొడిసింగి గ్రామాల్లో పర్యటించారు. గిరిజన గ్రామాల్లో గిరిపుత్రులు దైవచింతను కూడా వారి జీవన విధానంలో ఒక భాగంగా చేసుకోవడం స్వాగతించాల్సిన పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన అర్చకుల సంక్షేమసంఘం మండల అధ్యక్షుడు సత్యనారాయణ, సమరత సేవా ఫౌండేషన్ సభ్యులు వీరమల్లు వీరాస్వామి పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు



పాడి రైతులకు కార్డులు అందజేస్తున్న పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రశేఖరరావు

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలోని ప్రాంతీయ పశువుల ఆస్పత్రిని పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.చంద్రశేఖరరావు బుధవారం సందర్శించారు. ఆస్పత్రికి వచ్చిన పాడి రైతులకు యానిమల్ హెల్త్ కార్డులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ పశువుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్డు ద్వారా పశువుల ఆరోగ్య స్థితులను తెలుసుకోవచ్చన్నారు. శాశ్వత ట్యాగ్ నంబర్ ఉంటుందన్నారు.ఆరు పశువులు, 20 మేకలు, గొర్రెలకు ఒక కార్డు చొప్పున పంపిణీ చేశామన్నారు. అదనంగా పశువులు ఉంటే వాటికి కుడా కార్డులు అందజేస్తామరు. బీమా వర్తించాలంటే ఈ కార్డు తప్పనిసరిగా రైతులు వద్ద ఉండాలన్నారు. జాతి పశువు మరణిస్తే రూ.30 వేలు, నాటు జాతి పశువు మరణిస్తే రూ.15 వేలు, మేకలు,గొర్రెలు మరణిస్తే రూ.6 వేలు రైతుకు బీమా రుపంలో అందజేయడం జరుగుతుందన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు



మినుములపుట్టులో స్థానికులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే పాల్గుణ, పక్కన ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: ఎన్నడూ లేని విధంగా ఇంటివద్దకే ప్రభుత్వ పథకాలు వచ్చేస్తున్నాయి, మధ్యవర్తి లేకుండా అకౌంట్‌లో డబ్బులు జమ అవుతున్నాయి, గ్రామసచివాలయాల ద్వారా ప్రజల చెంతకే సేవలందుతున్నాయని, అందుకే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి అవ్వాలి.. మాకు ఈ పాలనే కావాలని సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రల ఎదుట కించాయిపుట్టు పంచాయతీ, మినుములపుట్టు గ్రామస్తులు అన్న మాటలివి.. మండలంలో గల కించాయిపుట్టు పంచాయతీ కేంద్రంలో పాటు మినుములపుట్టు గ్రామాల్లో బుధవారం ఉదయం 7 గంటల నుంచే నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రలు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి 540 గడపలను సందర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్‌ను గ్రామస్తులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పారదర్శకంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని, సచివాలయ వ్యవస్థ ద్వారా చెంతకే సేవలందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గిరిజనుల అభ్యున్నతే ధ్యేయంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి జగనన్నకు అందరూ మద్దతు పలికాలని, మరోసారి ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. ఎంపీపీ అరిసెల సీతమ్మ, సర్పంచ్‌లు రమేష్, బాబూరావు, నరసింగరావు, ఎంపీటీసీలు సుబ్బలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, నేతలు గాసిరావు, మత్స్యలింగం, రామ్మూర్తి, ఉదయ్, జయదేవ్, గాసిరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి అధికారులు హాజరు కావాలి



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి, పక్కన జెడ్పీటీసీలు వెంకటలక్ష్మి తదితరులు

రంపచోడవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు అన్ని శాఖ అధికారులు కచ్చితంగా హాజరు కావాలని వచ్చే సమావేశంలో గైర్హాజరైన వారిపై కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తామని రంపచోడవరం ఎంపీపీ బందం శ్రీదేవి అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ అధ్యక్షతన సమావేశం జరిగింది. జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి పాల్గొన్నారు. సమావేశంలో బడ్జెట్ ఖర్చుపై ఆమోదం తీర్మానం చేశారు. సమావేశంలో సభ్యులు పలు సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులపై నిర్లక్ష్యం వైఖరిపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆహారం సక్రమంగా ఇవ్వడం లేదని విద్యార్థినులు ఐటీడీఏలో తెలియజేస్తే మీరేం చేస్తున్నారని, ఏటీడబ్ల్యూవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు మరోసారి జరగకుండా చూడాలన్నారు. ఎంపీటీసీ వంశీ కుంజం మాట్లాడుతూ రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో కింది స్థాయి సిబ్బంది వచ్చిన రోగులను పట్టించుకోవడం లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అటవీ అధికారులు ఎవరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరు కావడం లేదన్నారు. వేములకొండ సర్పంచ్ కొమరం పండుదొర తమ పంచాయతీలో నీటి సమస్యపై అధికారులు స్పందించాలని కోరారు. ఈవోపీఆర్‌డీ జాన్‌మిల్టన్, వైస్ ఎంపీపీ పండా కుమారి, ఎంపీటీసీలు సింగోజి కుమారి, కత్తుల మంగా, ముచ్చిక సాయిబాబా, ఉలవల లక్ష్మి, తుర్రం వెంకటేశ్వర్లుదొర, కాజా వలీ , సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పచ్చని కుటుంబంలో పెను విషాదం

- గ్యాస్ ప్రమాద బాధితులు నలుగురూ మృతి
- నాలుగు రోజుల వ్యవధిలోనే కుటుంబం కనుమరుగు
- వాంబేకాలనీలో అలుముకున్న విషాదం
- కాలనీవాసుల చందాలతో అంత్యక్రియలు



తండ్రి బాలరాజుతో పెద్ద కుమారుడు గిరి, చిన్న కుమారుడు కార్తీక్‌తో తల్లి చిన్ని



ప్రమాద సమయంలో ఇంట్లో మంటలు

మధురవాడ/పీఎం పాలెం : ఆనందాల పొదరిల్లు అగ్నికి ఆహుతైపోయింది.. జీవితంపై ఎన్నో ఆశలు.. మరెన్నో కలలతో రెక్కల కష్టంతో ముందుకు సాగుతున్న ఆ కుటుంబం కలలన్నీ అగ్నికీలల్లో బూడిదైపోయాయి.. చేతికి అందొచ్చిన కుమారులను చూసుకుని మురిసిపోతున్న తల్లిదండ్రులను... ఆ తల్లిదండ్రులకు ఏ కష్టం రాకుండా వారు హాయిగా శేష జీవితం గడిపితే చూడాలనుకున్న కుమారులపై విధి కన్నెర్ర చేసింది.. ఒకరి వెంట ఒకరుగా వారం రోజుల వ్యవధిలో నలుగురినీ గ్యాస్ ప్రమాదం రూపంలో కబళించింది. బతుకుతెరువు కోసం నగరానికి పొట్ట చేత పట్టుకుని వచ్చిన ఈ కుటుంబం అర్ధంతరంగా కనుమరుగవడంతో మధురవాడ వాంబే కాలనీలో విషాదం నెలకొంది. వారం రోజుల కిందట ఇంటిలో గ్యాస్ లీకై సంభవించిన ప్రమాదంలో తల్లిదండ్రులు, వారి ఇద్దరు కుమారులు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. ఈ విషాద ఘటనకు సంబంధించి స్థానికులు, పీఎం పాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం...

రెక్కల కష్టంతో జీవనం

విజయనగరం జిల్లా భోగాపురం మండలం సవరవిల్లి గ్రామానికి చెందిన యామల బాలరాజుకు అదే జిల్లా చింతలవలస సమీపంలోని బెల్లాంకు చెందిన చిన్నితో గతంలో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు గిరి, కార్తీక్. వారికి మంచి భవిష్యత్ అందించాలన్న ఉద్దేశంతో బతుకుతెరువు కోసం పిల్లలను తీసుకుని విశాఖ నగరానికి వలస వచ్చేశారు. అలా పలుచోట్ల జీవించి 15 ఏళ్ల నుంచి మధురవాడ సమీప వాంబేకాలనీలో బ్లాక్ నంబర్ 27 బీలోని ఎఫ్ఎఫ్ 1, 2 ఇళ్లలో అద్దెకి ఉంటున్నారు. భార్య చిన్ని ఇళ్లల్లో పనులు చేస్తుండగా, బాలరాజు కార్పెంటర్. కుమారులు గిరి ఓ కంపెనీ ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తుండగా, కార్తీక్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. బాలరాజు, గిరి, కార్తీక్ కొద్ది రోజుల కిందట భవానీ మాల ధరించారు.

గ్యాస్ సిలిండర్ పిన్ బ్లాక్ అవ్వడంతో..

ఈ నెల 24న శుక్రవారం ఉదయం ఎఫ్ఎఫ్ 2 ఇంట్లో భవానీ మాలధారుల కోసం ప్రసాదం తయారు చేస్తున్నారు. ఆ సమయంలో సిలిండర్‌లో గ్యాస్ అయిపోవడంతో మరో సిలిండర్ అమర్చే క్రమంలో దాని పిన్ లోపలికి వెళ్లిపోయి బ్లాక్ అయిపోయింది. దీంతో బాగా గ్యాస్ లీకయింది. ఆ సమయంలో ఏమీ కనిపించక లైట్ వేయడంతోపాటు గదిలో దీపం కూడా ఉండడంతో... అప్పటికే ఇళ్లంతా వ్యాపించిన గ్యాస్ అంటుకుని అగ్నికీలలు ఎగసిపడ్డాయి. మంటలను ఆర్పేందుకు కుటుంబ సభ్యులంతా తీవ్రంగా యత్నించినా ప్రయోజనం లేకపోయింది. ఈ క్రమంలో నలుగురూ మంటల్లో తీవ్రంగా కాలిపోయారు. గమనించిన స్థానికులు వెంటనే 108 సాయంతో కేజీహెచ్‌కు తరలించారు. మరోవైపు అగ్నిమాపక శకటం మంటలను ఆర్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



అవగాహన సదస్సులో పాల్గొన్న రైతులు

వై.రామవరం: మండలంలోని చవిటి దిబ్బలు గ్రామంలో బుధవారం ఆయిల్ పామ్ రైతులకు సాగు పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. పతాంజలి ఫుడ్స్ (పెద్దాపురం) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ డీజీఎం ఎ.ఎస్.ప్రకాశ్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ పంటకు ప్రభుత్వ రాయతీలు, యాజమాన్య పద్ధతులు, బిందుసేద్యం(డ్రిప్), ఎరువుల వాడకం, సాగు విధానం, వచ్చే ఆదాయం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం పొందవచ్చన్నారు. ఆదర్శ రైతులు పి.వి.రెడ్డి, కె.బాబూరావు, వి.బుల్లబ్బాయి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు నరేష్, సతీష్, శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు

సాక్షి,పాడేరు: వచ్చే నెల ఒకటో తేదీన ప్రపంచ హెచ్ఐవీ/ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకుని వైద్య ఆరోగ్యశాఖ విస్తృత ప్రచారం, అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహిళా వసతి గృహంలో బుధవారం సాయంత్రం విద్యార్థినులకు ముగ్గులు పోటీలు ఏర్పాటుచేశారు. వీటిని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా ప్రారంభించారు. జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ తమర్బ విశ్వేశ్వరరావు,డీఐవో డాక్టర్ సాధన, సిబ్బంది పర్యవేక్షించారు. విజేతలకు ఒకటో తేదీన బహుమతులు అందజేస్తామని డాక్టర్ విశ్వేశ్వరనాయుడు తెలిపారు.

108 వాహనంలో ప్రసవం



శిశువును బంధువులకు అప్పగిస్తున్న 108 సిబ్బంది

మారేడుమిల్లి : 108 అంబులెన్స్‌లో బుధవారం ఓ మహిళా ప్రసవించింది. మండలంలోని వేటుకూరు పంచాయితీ పరిధిలోని భీమవరం గ్రామానికి చెందిన జి.చిన్నాలమ్మకు పురిటినొప్పులు రావడంతో బంధువులు స్థానిక పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. ఇక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం 108లో రంపచోడవరం తరలిస్తుండగా మార్గమధ్యలో పెద్దగెద్దాడ గ్రామం వద్ద గర్భిణి చిన్నాలమ్మకు పురిటినొప్పులు అధిక కావడంతో ఈఎంటీ కళ్యాణ్, పైలెట్ నాగేశ్వరరావు పురుడు పోశారు. అమె మగబిడ్డకు జన్మనిచ్చిందని, తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నట్టు 108 సిబ్బంది తెలిపారు.

రేపటి నుంచి చేనేత ఉత్పత్తుల ప్రదర్శన

బీచ్ రోడ్డు: క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(సీసీఏపీ) ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి వసంతం -2023 పేరుతో హస్తకళలు, చేనేతల ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహించనున్నట్టు సీసీఏపీ ప్రతినిధులు అమ్మాజి తెలిపారు. నగరంలోని ఒక హోటల్‌లో బుధవారం ఆమె విలేకరులతో మా ట్లాడారు. రామ్‌నగర్‌లోని గ్రీన్ పార్క్ హోటల్ లో శుక్ర, శనివారాల్లో ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. ఏపీ, తెలంగాణ, కేరళ, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, అస్సాం, మణిపూర్, ఢిల్లీ, రాజస్థాన్ తదితర ప్రాంతాల్లో సేకరించిన ఉత్పత్తులను ప్రదర్శిస్తామన్నారు. ప్రారంభోత్సవం రోజున చేనేత వస్త్రధారణతో ఫ్యాషన్ షో నిర్వహించనున్నట్టు తెలిపారు.

రేపు మినీ జాబ్ మేళా

తుమ్మపాల: రానున్న డిసెంబర్ 1న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, రేబాకలో మినీ జాబ్ మేళా నిర్వహిస్తునట్టు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి టి. చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా పరవాడలో గల రిఫ్రా టెక్నిక్ కంపెనీలో అప్రెంటిస్ ట్రైనీ పోస్ట్‌కి ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. డిప్లొమా(మెకానికల్, ఎలక్ట్రికల్) ఐ.టి.ఐ(ఫిట్టర్, వెల్డర్, మెకానికల్, ఎలక్ట్రికల్) చదువుకొని, 18 నుండి 25 ఏళ్ల వయస్సు గల యువకులు పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్.7036363272 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

త్వరలో 14 డీసీసీబీ బ్రాంచ్‌లు

- ప్రతి మండలంలో సహకార బ్యాంకు శాఖ
- డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు
- నర్సీపట్నంలో నూతన భవనం ప్రారంభం



పీఏసీఎస్, బ్రాంచ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు తదితరులు

నర్సీపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాలో త్వరలో 14 బ్రాంచ్‌లను ఏర్పాటు చేస్తున్నామని డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు చెప్పారు. నర్సీపట్నంలో రూ.53 లక్షలతో నిర్మించిన పీఏసీఎస్, ది విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ నూతన భవన సముదాయన్ని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆనాడు డా.వై.ఎస్.రాజశేఖరరెడ్డి సహకార రంగానికి జీవనం పోశారని, నేడు సీఎం జగన్మోహన్‌రెడ్డి కోఆపరేటివ్ సొసైటీలను మరింత బలోపేతం చేశారన్నారు. డీసీసీబీ సేవలను రైతులకు మరింత చేరువ చేసేందుకు రాష్ట్రంలో ప్రతి మండలంలో బ్రాంచ్‌లు ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారన్నారు. దీనిలో భాగంగానే ఉమ్మడి జిల్లాలో 14 బ్రాంచ్‌లను త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. వ్యవసాయరంగానికి డీసీసీబీ మొదటి ప్రాధాన్యం ఇస్తుందని, రైతులకు పెట్టుబడి రుణాలను వెనువెంటనే మంజూరు చేస్తోందన్నారు. మరో అడుగు ముందుకేసి డ్వాక్రా సంఘాలకు కూడా రుణాలు ఇస్తుందన్నారు. జిల్లాలో ఇప్పటికే కొన్ని బ్రాంచ్‌ల ద్వారా రుణాలు ఇచ్చే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. సొంత స్థలం ఉండి పెట్రోల్ బంక్‌లు ఏర్పాటుకు ఆసక్తి గల వారికి డీసీసీబీ నుంచి రుణాలు మంజూరు చేస్తామన్నారు. డీసీసీబీలో రూ.2,100 కోట్ల టర్నోవర్ జరుగుతోందన్నారు. నర్సీపట్నం బ్రాంచ్ టర్నోవర్ రూ. 110 కోట్లుగా ఉందన్నారు. ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ మాట్లాడుతూ నర్సీపట్నంలో నూతన భవనం నిర్మించటం అభినందనీయమన్నారు. పీఏసీఎస్‌లు రైతులకు అవసరమైన రుణాలు అందజేసి అండగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, డీసీసీబీ మాజీ చైర్మన్ రాజా సాగి రామచంద్రరాజు, డీసీసీబీ జనరల్ మేనేజర్ శ్రీనివాస్, పీఏసీఎస్ అధ్యక్షుడు గుడివాడ సన్యాసినాయుడు, డైరెక్టర్లు గవిరెడ్డి స్వామినాయుడు, గవిరెడ్డి శ్రీను, వైఎస్సార్‌సీపీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, బ్రాంచ్ మేనేజర్ నాయుడు పాల్గొన్నారు.

కొరియర్‌లో గంజాయి రవాణా

అల్లిపురం (విశాఖ): కొరియర్‌లో గంజాయి సరఫరా చేస్తున్నట్లు వచ్చిన పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ తెలిపారు. నగర టాస్క్ ఫోర్స్ పోలీసులు, టూటౌన్ పోలీసులతో కలిసి ఆయన బుధవారం మధ్యాహ్నం టూటౌన్ పరిధి అచ్చియ్యమ్మపేట, జీవీఎంసీ స్కూల్ సమీపంలోని ఓ ఇంటిపై దాడి చేశారు. అక్కడ నిల్వ చేసిన సుమారు 200 కేజీల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గంజాయి కలిగి ఉన్న ఇంట్లో ఉన్నవారు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారు ఇతర రాష్ట్రాలు, దేశాలకు కూడా ఇక్కడ నుంచి ఏడాదిన్నరగా కొరియర్‌లో గంజాయి సరఫరా చేస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. గంజాయితో పాటు అద్దెకు ఇచ్చిన ఇంటిని కూడా సీజ్ చేసినట్లు తెలిపారు. కొరియర్ సంస్థలు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరంలో మరికొన్ని చోట్ల గంజాయి సరఫరా చేస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. అక్కడ కూడా ప్రత్యేక బృందాలతో దాడులు నిర్వహిస్తామన్నారు. ఇంటి యజమానులు అద్దెకు దిగేవారి వివరాలను పూర్తిగా కనుక్కొన్న తరువాతే ఇళ్లు అద్దెకు ఇవ్వాలన్నారు. ఇళ్లలో పనిమనుషుల నుంచి కూడా ఆధారంగా ఆధార్ కార్డు తీసుకోవాలన్నారు. గంజాయి రవాణా చేసినా, గంజాయి రవాణా చేసేవారికి సహకరించినా, అటువంటి వారికి ఇళ్లు అద్దెకు ఇచ్చినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడులో డీసీపీ-1, కె.శ్రీనివాసరావు, టాస్క్‌ఫోర్సు ఏసీపీ, ఏసీపీలు, టూటౌన్ సీఐ, ఎస్ఐ సిబ్బంది పాల్గొన్నారు.

చెరకు రస నాణ్యత పరీక్షలు ప్రారంభం

గోవాడ సుగర్స్‌లో క్రషింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్న యాజమాన్యం



రసనాణ్యత పరీక్షల యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఫ్యాక్టరీ ఎండీ సన్యాసినాయుడు

చోడవరం: ఈ ఏడాది క్రషింగ్ సీజన్‌కు గోవాడ సుగర్ ఫ్యాక్టరీ సర్వం సిద్ధం చేసింది. మరో 15 రోజుల్లో క్రషింగ్ ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. ముందుగా ఓవరాయిలింగ్ జరిగిన యంత్రాల పనితీరుపై ట్రయల్ రన్ పనులు చేపట్టారు. నాలుగు రోజుల కిందట సెంట్రిఫ్యూగల్ యంత్రాన్ని ప్రారంభించిన యాజమాన్యం బుధవారం చెరకు నాణ్యత పరీక్షలకు శ్రీకారం చుట్టింది. రసనాణ్యత పరీక్ష చేసిన తర్వాత చెరకు పంటకు కటింగ్ పర్మిట్లు ఇస్తారు. ఆ పరీక్షలను ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ వి.వి.సన్యాసినాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ ఏడాది క్రషింగ్ సీజన్‌ను డిసెంబరు 15వ తేదీ నుంచి లాంఛనంగా ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. క్రషింగ్ ప్రారంభించే సమయానికి కనీసం రోజుకు 1000 నుంచి 2000 టన్నుల చెరకు ఫ్యాక్టరీకి సరఫరా కావాల్సి ఉంది. రెగ్యులర్ క్రషింగ్ జోరందుకుంటే రోజుకు 3 వేల నుంచి 4 వేల టన్నుల వరకు చెరకు సరఫరా కావాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో ఇప్పటి నుంచే ఫ్యాక్టరీ పరిధిలో ఉన్న చెరకును రసనాణ్యత పరీక్షలు చేసి కటింగ్ పర్మిట్లు ఇవ్వాలని ఫీల్డు సిబ్బందికి యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. పక్వానికి వచ్చిన తోటలను వ్యవసాయ ఫీల్డు సిబ్బంది గుర్తించి రసనాణ్యత పరీక్షల కోసం ఫ్యాక్టరీకి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు.